క్లుప్తంగా

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా కాళికాంబ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ,పంచామృతాభిషేకం అనంతరం పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు.

దస్తగిరి స్వామికి ప్రత్యేక ఫాతెహాలు

రుద్రవరం: మండలంలోని ముకుందాపురం, కొండమాయపల్లె గ్రామాల్లో శుక్రవారం దస్తగిరి స్వామి దర్గాల్లో ప్రజలు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. ఏటా ఆయా గ్రామాల్లో దర్గాల వద్ద కందొరి పేరుతో దర్గాలను విద్యుత్ దీపాలతో అలంకరించి మేళతాళాలతో జెండాలతో గ్రామోత్సవం నిర్వహించి స్వామి వారికి సమర్పించడం ఆనవాయితీ. ఇందులో భాగంగానే ఈ ఏడాది దర్గాల వద్ద ప్రత్యేక పూజలు చేపట్టినట్లు ఆయా గ్రామాల పెద్దలు తెలిపారు.

ఇంటి వద్దకే పశు వైద్యం



ఉయ్యాలవాడలో గొర్రెకు చికిత్స చేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్

ఉయ్యాలవాడ : ప్యామిలీ ఫిజీషియన్ తరహాలోనే మూగ జీవాలకు సైతం ఒక్క ఫోన్ కాల్‌తో పశు వైద్యం ఇంటి వద్దకే చేరువవుతుండడంతో పశుపోషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పశు వైద్యాధికారులు అందుబాటులో లేకపోవడంతో గ్రామానికి చెందిన గురప్ప, నరసింహుడు తమ గొర్రె పిల్లలకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో 1962 నంబర్‌కు ఫోన్ చేశారు. దీంతో ఆళ్లగడ్డ పట్టణం నుంచి పశు సంచార సేవ బృందం గ్రామానికి చేరుకుని మూగ జీవాలకు వెటర్నరీ అసిస్టెంటు హరీప్సా,పైలట్ మహమ్మద్ గౌస్ చికిత్స చేశారు.

పుస్తకాలు మంజూరు

ఉయ్యాలవాడ : ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. వేసవి కాలంలో విద్యార్థులు తాము నేర్చుకున్న విద్యను మరచి పోకుండా ఉండేందుకు సమ్మర్ క్యాంపులో భాగంగా పుస్తకాలను అందజేసింది. 3,4,5 తరగతులు చదువుతున్న విద్యార్థులకు 533 పుస్తకాలు మంజూరయ్యాయని, వాటిని హెచ్ఎంలకు శుక్రవారం అందజేశామని ఎంఈఓ అనురాధ తెలిపారు.

సిద్ధేశ్వరం బ్యారేజీ నిర్మించాలి

నంద్యాల(వ్యవసాయం): సిద్ధేశ్వరం అలుగు వద్ద బ్రిడ్జి కం బ్యారేజీని నిర్మించాలని భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడు ఫిరంగి బ్రహ్మయ్యచారి, జిల్లా కిసాన్ సంఘ్ ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మించడం వల్ల సిద్ధేశ్వరం నుంచి హైదరాబాద్‌కు 90కి.మీ తగ్గుతుందని, అలాగే రాయలసీమ రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సంఘ్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాదరాజు, పుల్లారెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా ఉరుసు

చాగలమర్రి: మండల కేంద్రంలో వెలసిన బందేశావలి దర్గా ఉరుసు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాను రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు జెండాలతో దర్గాకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి నిర్వహించిన ఖవ్వాలి ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఇసుక బస్తా మోసే పోటీలో ఉప్పు గఫార్ ప్రథమ బహుమతి గెలుచుకున్నాడు.

త్వరలో సెబ్ స్టేషన్ నిర్మాణం

ఆళ్లగడ్డ : పట్టణంలో త్వరలో సెబ్ స్టేషన్ నిర్మాణం చేపడుతామని ఇన్‌స్పెక్టర్ చంద్రమణి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హరినాథరావు సెబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన స్థలం మంజూరు పత్రాన్ని శుక్రవారం ఆమెకు అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సెబ్ స్టేషన్ నిర్మాణానికి పడకండ్ల సమీపంలో 20 సెంట్లు కేటాయించామని చెప్పారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

రుద్రవరం: ఉద్యోగ భద్రత కల్పించాలని, తమ సమస్యల పరిష్కరించాలని 104 వాహన సిబ్బంది శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. 104 వాహన సి బ్బంది ప్రశాంత్ మాట్లాడుతూ స్టేట్ కమిటీ కార్యచరణలో భాగంగా నల్ల బాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తున్నామన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్, డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని,104 వాహన సేవలు రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని, ఉద్యోగులను కాంట్రాక్ట్-ఏపీసీఓఎస్‌లో చేర్చడం వంటి సమస్యల పరిష్కారం కోసం నిరసన చేపట్టినట్లు తెలిపారు.

క్రీడా దుస్తుల పంపిణీ

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి 4వ జూనియర్స్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా తెలుగుగంగ జేఈ సలీం క్రీడాకారులు, అంపైర్లకు శుక్రవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఎన్‌డీటీసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవంత్, జిల్లా కార్యదర్శి మహబూబ్ బాషా ఉన్నారు.

చితికిన రైతుకు మద్దతు

- రంగుమారిన మొక్కజొన్నకు మద్దతు ధర
- కొనుగోళ్ల నిబంధనల్లో మార్పులు
- క్వింటాకు ధర రూ.1,962 ప్రకారం చెల్లింపు
- రెండు వారాల్లోపు రైతుల ఖాతాల్లో నగద జమ



ఆళ్లగడ్డలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే (ఫైల్)



మొక్కజొన్న ధాన్యం తడవకుండా ప్లాస్టిక్ పట్ట కప్పతున్న రైతు

ఆళ్లగడ్డ: ప్రకృతి కన్నెర్రతో చేతికొచ్చిన పంట కళ్ల ముందే దెబ్బతిని ఆందోళనలోనున్న మొక్కజొన్న రైతుకు ప్రభుత్వం తీసుకున్న సరళతర కొనుగోళ్ల నిర్ణయం ఊపిరిపోసింది. వాతావరణ మార్పులు, తుపానులతో పంట వెన్ను విరిగిపోయి నేలవాలడం.. ఆరబోసిన ధాన్యం తడిసి రంగు మారి, ముగ్గిపోవడంతో ఏం చేయాలో తెలియక అయోమయంలో ఉన్న మొక్కజొన్న సాగుదారులకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కనీస మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయడంతో ఊరట లభించింది. మొన్నటి వరకు దళారుల చక్రంలో ఇరుక్కుని వారు చెప్పిన ధరకే అమ్మేవారు. గింజలు రంగు మారాయని, మగ్గిపోయాయని..ఇలా సవాలక్ష సాకులతో ఇష్టానుసరంగా ధర నిర్ణయించేవారు. మద్దతు ధర మాట దేవుడెరుగు ఉన్న గింజలను అమ్ముకుంటే చాలని నాడు వారికి విక్రయించేవారు. ప్రభుత్వం నిబంధనలను సడలించి మద్దతుగా నిలుస్తుండటంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మద్దతు ధర రూ.1,962..

అకాల వర్షంతో దెబ్బతిన్న మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని ప్రభుత్వం మద్దతు ధర రూ.1,962 ప్రకటించి కొనుగోలు చేయాలని ఆదేశించింది.

మండలాల వారీగా మొక్కజొన్న సాగు, దిగుబడి..

మండలం	మొక్కజొన్న సాగు హెక్టార్లలో	దిగుబడి క్వింటాళ్లలో	విక్రయించేందుకు నమోదు చేసుకున్న రైతులు
ఆళ్లగడ్డ	2,864	2,29,120	136
ఉయ్యాలవాడ	155	12,400	10
చాగలమర్రి	1,503	1,18,737	65
దొర్నిపాడు	10	857	--
రుద్రవరం	1,809	1,42,588	148
శిరివెళ్ల	401	32,882	31
మొత్తం	6,742	5,36,584	390

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



రైతులు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దళారుల మాటలకు మోసపోకుండా కొనుగోలు కేంద్రాలకు తరలించి విక్రయించుకోవాలి. పదిహేను రోజుల్లో సొమ్ము ఖాతాల్లో జమవుతుంది.

– రామ్మోహన్‌రెడ్డి,ఏడీఏ, ఆళ్లగడ్డ

ప్రస్తుతం సంబంధిత అధికారులు క్వింటా రూ.1962 ప్రకారం రైతులకు చెల్లిస్తున్నారు. మార్కెట్ రేటును పరిగణలోకి తీసుకుని అందుకు అనుగుణంగా మంచి రేటు అందించడంతో పాటు రవాణా, సంచుల ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తోంది.

రెండు వారాల్లోపు ఖాతాల్లో నగదు..

రైతులు నష్టపోకుండా క్వింటా రూ.1,962 ధరతో కొనుగోలు చేసేలా కొనుగోలు ప్రక్రియను ప్రారంభించింది. గతంలో తేమ శాతం 12 కంటే అధికంగా ఉండకూడదు అనే నిబంధన ఉండేది. ఇప్పుడు తేమ శాతాన్ని 14 వరకు పెంచడంతో పాటు ధాన్యం సొమ్ములు నేరుగా రైతు ఖాతాల్లో జమ చేసేందుకు చర్యలు చేపట్టింది. రైతుల నుంచి ఆయా సొసైటీలు, డీసీఎంఎస్‌లకు మొక్కజొన్నలు చేరిన 15 రోజుల్లోపు నగదు జమ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వ్యాపారుల తీరు మారింది



అకాల వర్షంతో మొక్కజొన్నలు కొంచం తడిసిపోయాయి. వ్యాపారులు వచ్చి నాణ్యతగా ఉన్నప్పటికీ ఇవి రంగు మారాయి.. ముగ్గిపోయాయి అని సాకులు చెబుతూ రూ.1400 ఇస్తావా.. అంతకంటే మంచి ధర లభించదని భయపెట్టారు. అయితే ప్రభుత్వం రూ.1,962 ప్రకారం కొనుగోలు చేస్తుందని తెలియడంతో ఇప్పుడు రూ.1,600 నుంచి రూ.1,800 వరకు కళ్లం దగ్గరే సొమ్ము ఇస్తామని వస్తున్నారు.

– రామకృష్ణ, రైతు, కోటకందుకూరు

ఆనందంగా ఉంది



30 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. పంట సగం కోసి ఆరబోస్తుండగా వడగండ్ల వర్షం వచ్చింది. దీంతో మొక్కజొన్నలు తడిచిపోయాయి. కోయని పంట నేలవాలింది. దీంతో ధర మాట దేవుడెరుగు వీటిని ఎంతో కొంతకు ఎలా అమ్ముకోవాలా.. అని ఆలోచిస్తున్న సమయంలో ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడంతో పాటు నిబంధనల్లో సడలింపులు చేసి కొనుగోలు చేయడం ఆనందంగా ఉంది.

– విశ్వనాథరెడ్డి – రైతు, ఓబులంపల్లె

నేడు ఎమ్మెల్యే రాక

ఉయ్యాలవాడ : మండలంలోని నర్సిపల్లె గ్రామానికి శనివారం సాయంత్రం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి రానున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, పంచాయతీరాజ్ ఏఈ రామకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.15 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశామన్నారు. రోడ్డును ప్రారంభించేందుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరవుతారని చెప్పారు.

పర్యావరణ సంరక్షణ అందరి బాధ్యత

రుద్రవరం: పర్యావరణాన్ని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని నూతల సెక్షన్ అధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. పర్యావరణ హిత జీవనశైలిలో భాగంగా శుక్రవారం రుద్రవరం రేంజి నూతల సెక్షన్ అధికారులు మండల పరిధిలోని హరినగరంలో గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఫారెస్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు మొక్కలు పెంచి పర్యావరణాన్ని పెంపొందించాలని చెప్పారు. కార్యక్రమంలో నూతల సెక్షన్ ఎఫ్‌బీఓలు నాగేంద్రయ్య, రామకృష్ణ, ప్రొటక్షన్ వాచర్ దానమయ్య, పంచాయతీ కార్యదర్శి శివకృష్ణ, గ్రామ పెద్ద నాగముని పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

ఉయ్యాలవాడ : నాడు – నేడు కార్యక్రమంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆ శాఖ ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని పాఠశాలలకు రెండో విడతలో రూ.5.20 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఉయ్యాలవాడ, మాయలూరు, బోడెమ్మనూరు, హరివరం, కొండుపల్లె ఉన్నత పాఠశాలలు, పెద్దయమ్మనూరు, ఆర్.జంబులదిన్నె, నర్సిపల్లె, రూపనగుడి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో పనులు జరుగుతున్నట్లు వెల్లడించారు. ఆయా పాఠశాలల్లో మరుగుదొడ్లు, టాయిలెట్లు, తరగతి గదుల్లో బండ పరుపు వంటి 9 రకాల అభివృద్ధి పనులను పాఠశాలలు పునః ప్రారంభం నా టికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

అదనపు కోర్టులు ఏర్పాటు చేయాలి



హైకోర్టు న్యాయమూర్తి జయసూర్యకు వినతి పత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల కోర్టు ఆవరణలో అదనపు కోర్టులు ఏర్పాటు చేయాలని నంద్యాల బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు విజయశేఖర్‌రెడ్డి, ప్రతాపరెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడలో హైకోర్టు న్యాయమూర్తులను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి కోర్టులో, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో వేల సంఖ్యలో కేసులు ఉండటంతోపరిష్కారం కావడం లేదని, వేగంగా న్యాయం లభించాలంటే.. అదనపు మెజిస్ట్రేట్ కోర్టు, అదనపు మున్సిఫ్ కోర్టు ఏర్పాటుకు కృషి చేయాలని విజయవాడలోని హైకోర్టు న్యాయమూర్తులైన కర్నూలు జిల్లా పోర్ట్ పోలియో జడ్జి జయసూర్య, శేషసాయి, శ్యాంసుందర్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తులు స్పందిస్తూ త్వరితగతిన కక్షి దారులకు న్యాయం చేకూర్చడం కోసం రెండు అదనపు కోర్టుల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఉపాధ్యక్షుడు రఘు ప్రకాష్, స్పోర్ట్స్ సెక్రటరీ ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్లు శాశ్వత ప్రాతిపదికన ఇవ్వాలి

నంద్యాల(వ్యవసాయం): ఉపాధ్యాయులకు శాశ్వత ప్రాతిపదికన ప్రమోషన్లు కల్పించాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ జిల్లా జనరల్ సెక్రటరీ షరీఫ్ కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీచర్లకు రూ.2,500 అదనపు అలవెన్స్ ఇచ్చి స్కూల్ అసిస్టెంటుగా తాత్కాలిక ప్రాతిపదికన, పని సర్దుబాటు పేరుతో ఇచ్చిన తాత్కాలిక పదోన్నతులను రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

దీక్షను విజయవంతం చేద్దాం

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 31వ తేదీన సిద్ధేశ్వరం అలుగు శంకుస్థాపన 7వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అలుగు సాధన కోసం 16గంటల పాటు చేపట్టే జల జాగారణ దీక్షను విజయవంతం చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైఎన్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సమితి కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సీమ అభివృద్ధికి కావలసిన అనేక వనరులు, అటవీ సంపద, పంటలు, వాతావరణం, జాతీయ, అంతర్జాతీయ అవసరాలకు అవసరమైన విత్తనాలను ఉత్పత్తి చేయగల మానవ వనరులు ఈ ప్రాంతంలో ఉన్నాయన్నారు. నాయకులు దశరథరామిరెడ్డి, ఏర్వ రామచంద్రారెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలను కాపాడవచ్చు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి,



సీపీఆర్ చేస్తున్న డాక్టర్ శివరంజని

నంద్యాల(సిటీ): అత్యవసర సమయాలల్లో ఫస్ట్ ఎయిడ్, సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్)తో మనిషిని ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సూరజ్ ఫంక్షన్ హాల్‌లో శిల్పా సేవా సమితి ఆధ్వర్యంలో అత్యవసర సమయాల్లో ఫస్ట్ ఎయిడ్, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సచివాలయ, హెల్త్ సెక్రటరీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శిల్పా రవి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ప్రతి ఒక్కరూ పాటించాల్సిన పద్ధతులను తెలుసుకోవాలన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని రక్షించేందుకు తప్పనిసరిగా ఫస్ట్ ఎయిడ్, సీపీఆర్‌లను తెలుసుకుంటే కొంత మేర ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని చెప్పారు. అనంతరం వైద్యులు శివరంజని, ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ అత్యవసర సమయాలల్లో ఆరోగ్య విభాగంలో విధులు నిర్వహించే వారు హృదయశ్వాసకోశ పునరుజ్జీవనం(సీపీఆర్), ఫస్ట్ ఎయిడ్‌ల పట్ల మెలకువలు తెలుసుకోవాలన్నారు. అనుకోకుండా చిన్నారులు కాయిన్‌లు మింగినా, అన్నం తినేటప్పుడు ఎముకలు, ఇతర ఆట వస్తువులు మింగినా ఎలా ప్రవర్తించాలో వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన వర్క్‌షాప్ ద్వారా సీపీఆర్, ఫస్ట్ ఎయిడ్ ఎలా చేయాలో ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. అలాగే..డబ్ల్యూహెచ్ఓ నిర్ధారించిన ఓఆర్ఎస్‌ను మాత్రమే తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, డీఈఈ శ్రీనివాసరెడ్డి, హెల్త్ సెక్రటరీలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఫ్రైడే-డ్రైడే'తో ఆరోగ్యం పదిలం



నీటి డ్రమ్మును పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ

నంద్యాల(రూరల్): ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం ప్రజల ఆరోగ్యాన్ని రక్షిస్తుందని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ తెలిపారు. శుక్రవారం మండలంలోని చాబోలు గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, వైద్య సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఆయన మాట్లాడుతూ నీరు నిల్వ ఉంచిన డ్రమ్ములు, కుంటలను ప్రతి శుక్రవారం శుభ్రం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, మెదడు వాపు జ్వరాలు తదితర రోగాలు వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. వాటి నివారణకు డ్రమ్ములు, తొట్లను శుభ్రం చేసి, గంటసేపు ఎండలో ఆరబెట్టాలని చెప్పారు. జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వరప్రసాద్‌రెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే పరమావధి



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల

శిరివెళ్ల: ప్రజా సంక్షేమమే పరమావధిగా తమ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక 1వ గ్రామ సచివాలయ పరిధిలోని 1,2 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న ఆయనకు స్థానిక నాయకులు, కార్యకర్తల నుంచి ఘన స్వాగతం లభించింది. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. అమ్మఒడి, రైతు భరోసా, చేయూత, ఆసరా, కాపు నేస్తం, వాహన మిత్ర, సున్నా వడ్డీ ద్వారా నాలుగేళ్లలో ఎంత మేర లబ్ధి పొందారో చదివి వినిపించారు. ఇంకా సమస్యలేవైనా ఉన్నాయా అంటూ అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ హామీలు నెరవేర్చడంలో జగనన్న దేశంలోనే ఆదర్శంగా నిలిచారని, చంద్రబాబులా మాయ మాటలతో మభ్యపెట్టలేదన్నారు. మండల కేంద్రం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుకు రూ.12 కోట్లు మంజూరు చేయించామన్నారు. రూ.6 కోట్లతో వివిధ పనులు మొదలు పెట్టామని చెప్పారు. ఇంత చేస్తున్నా.. టీడీపీ అభివృద్ధిని అడ్డుకోవడమే కాకుండా.. అభివృద్ధి ఏదీ అని విమర్శించడం దారుణమని, గ్రామాల్లో తిరిగితే పనులు చేసింది..లేనిది తెలిసిపోతుందని, ఇళ్లల్లో కూర్చొని మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదే రూ.1.50 కోట్లతో సిమెంట్ రోడ్లు, పాఠశాలలకు ప్రహరీలు నిర్మాణాలు చేపట్టామని గుర్తు చేశారు. సర్పంచు సాలమ్మ, ఉప సర్పంచు ఇంతియాజ్, ఎంపీపీ నాయక్ వసీం, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బి.అబ్దుల్ సలాం, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ బేగం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నజీర్, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ హఫీజ్, నాయకులు ఇందూరి ప్రతాపరెడ్డి, దాదిరెడ్డి తిమ్మరాయుడు, బోయలకుంట్ల సర్పంచ్ జింకల నాగన్న, వీరారెడ్డి పల్లె సర్పంచ్ శివారెడ్డి, ఎంపీటీసీ నసీమా, సర్దార్, అన్వర్, దొర్నిపాటి రఫీ, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, ఈఓఆర్డీ సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం





మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా, అధికారులతో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

నంద్యాల: సంక్షేమ పథకాలతో పేదల ఇళ్లల్లో సంతోషం విరబూస్తోందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 5వ వార్డులో కౌన్సిలర్ అరీఫ్‌నాయక్‌తో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వార్డు నాయకులు, మహిళలు హారతులు, గజమాలలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ప్రతి ఇంటికీ వెళ్లి పథకాలను ప్రజలకు వివరించారు. నాలుగేళ్ల కాలంలో పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని చదివి వినిపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలోనే ఇచ్చిన హామీలు 95శాతం మేర నెరవేర్చారన్నారు. గతంలో ప్రభుత్వ పథకాలు అందాలంటే కార్యాలయాలు, నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ప్రస్తుతం సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ద్వారా పథకాలు ప్రజల ఇంటి ముంగిటకే చేరుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, కౌన్సిలర్లు కలాంబాషా, సాదిక్‌బాషా, సమ్మద్, నాయకులు పార్థసారథి, సోమశేఖర్‌రెడ్డి, రహంతుల్లా, మునెయ్య, పూలశీను పాల్గొన్నారు.

రైతులకు మేలు చేసేందుకే మిర్చి యార్డు ఏర్పాటు

నంద్యాల(అర్బన్): గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లి మిరప విక్రయాలకు రైతులు పడుతున్న అవస్థలను తొలగించేందుకే నంద్యాల టెక్కె మార్కెట్ యార్డులో మిర్చి యార్డు ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి తెలిపారు. స్థానిక యార్డులో జరుగుతున్న మిర్చి కొనుగోళ్లను శుక్రవారం మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, కార్యదర్శి కల్పన, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రేడర్లు, రైతులతో మాట్లాడారు. గుంటూరులో లభిస్తున్న ధరలు ఇక్కడ కూడా అందుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.

'విద్యా కానుక' పకడ్బందీగా పంపిణీ చేయాలి





పుస్తకాల స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్,రెమిడియల్ తరగతులను పరిశీలిస్తున్న కలెక్టర్

నంద్యాల: నూతన విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోపు పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్య కానుక కిట్లను పంపిణీ చేసేందుకు పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిల్లానీ శామూన్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని ఎస్పీజీ హైస్కూల్‌లోని మండల స్టాక్ పాయింట్‌ను, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న రెమిడియల్ తరగతులను, అప్పర్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను అధికారులతో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల యూనిఫాం దుస్తులను భౌతిక కొలతల ప్రకారం వచ్చాయా లేదా అని పరిశీలించారు. పాఠ్య పుస్తకాలను క్రమ పద్ధతిలో క్లాసుల వారీగా విభజించి సరఫరా చేయాలన్నారు. జూన్ 1 –12 తేదీ వరకు మండల స్టాక్ పాయింట్ల నుంచి అన్ని పాఠశాలలకు కిట్లు సరఫరా చేయాలని చెప్పారు. ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఏపీఎం, నాడు–నేడు ఏఈలతో ఏర్పాటు చేసిన మండల టీం ప్రతిరోజు స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తూ కిట్లలో ఏమైనా లోపాలు ఉంటే సంబంధిత సప్లయర్‌ను సంప్రదించి రీప్లేస్ చేసుకోవాలని సూచించారు. అన్ని మండల స్టాక్ పాయింట్లు తనిఖీ చేయాలని డీఈఓ అనూరాధను ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రెమీడియల్ తరగతులు జరుగుతున్న కేంద్రాన్ని పరిశీలించారు. చివరగా ఆత్మకూరు బస్టాండ్ రోడ్లోని అప్పర్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ ఎలా చేస్తారని మెడికల్ ఆఫీసర్‌ను ప్రశ్నించారు. ఐడీ క్రియేషన్, కాల్స్ డేటా, క్యాలెండర్ మెయింటైన్ సంబంధిత రిజిస్టర్లు నిర్వహిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకుంటూ రికార్డులను పరిశీలించారు.

చిరుధాన్యాల్లో మంచి పోషకాలు

దొర్నిపాడు: చిరుధాన్యాలైన కొర్ర, రాగులు తదితర వాటిల్లో మంచి పోషకాలు ఉండటంతో మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, రానున్న ఖరీఫ్‌లో సాగు చేయాలని ఏడీఏ కృష్ణమోహన్ రైతులకు సూచించారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యలయంలో మండల స్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. తక్కువ కాలపరిమితితో పండుతున్న చిరుధాన్యాలకు మంచి ఆధరణ ఉందన్నారు. అనంతరం చిరుధాన్యల ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ శకుంతలారెడ్డి, ఏఓ శ్రీకృష్ణ, పశువైద్యాధికారి హరిత పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్‌డే

నంద్యాల టౌన్ : నంద్యాల జిల్లా పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో వివిధ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీలపై ఎస్పీకి వినతులు సమర్పించారు.

బొమ్మలసత్రం: దిశ యాప్ పట్ల మహిళలకు అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దిశా యాప్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ గ్రామంనుంచి జిల్లా స్థాయి వరకు పూర్తి చేశామని చెప్పారు.

ఎస్పీని కలిసిన డీఎస్పీ



ఎస్పీ రుఘువీర్ రెడ్డిని కలిసిన నూతన డీఎస్పీ సంతోష్

బొమ్మలసత్రం: బదిలీల్లో భాగంగా రాజమండ్రి నుంచి నంద్యాల జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన సంతోష్ శుక్రవారం ఎస్పీ కే.రఘువీర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా ఆయన కార్యాలయంలో కలిశారు. స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా తన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తానని సంతోష్ కుమార్ పేర్కొన్నారు.